


- నేడు పిఠాపురంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక
- ముగిసిన నృత్యోత్సవాలు
- 'ఎస్సీ వర్గీకరణ సాధించేవరకూ పోరాటం'



విషపూరిత.. కోనో కార్పస్

- హాని చేసే కోనో కార్పస్ మొక్కలు
- చర్మ, శ్వాసకోశ వ్యాధులు వచ్చే ప్రమాదం
- పర్యావరణ సమతుల్యతకు విఘాతం
- పక్షులు వాలని ప్రాణాంతక చెట్టు
- అవగాహన లేక రహదారుల పక్కన, పార్కుల్లో విరివిగా నాటిన మున్సిపాల్టీలు
- కోనోకార్పస్ చెట్లను తొలగించాలని ఇటీవల సమావేశంలో కలెక్టర్ ఆదేశం
- కాకినాడలో 4602 చెట్లున్నట్లు గుర్తింపు



కాకినాడ దేవాలయం వీధిలో రోడ్డుకి ఇరువైపులా కోనోకార్పస్ మొక్కలు ఇలా..

పచ్చని చెట్లు ప్రగతికి సోపానాలు.. అంటారు.. అందుకే ప్రభుత్వాలు మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపడుతుంటాయి. పచ్చని చెట్లతో గాలిలో ఆక్సిజన్ శాతం పెరిగి ఆహ్లాదకర వాతావరణం ఏర్పడుతుంది. కానీ, అన్ని రకాల చెట్లు మనకు మేలు చేస్తాయని అనుకోకూడదు. పర్యావరణానికి హాని చేకూర్చే చెట్లూ ఉంటాయి. అటువంటి ప్రమాదకరమైన మొక్కల్లో కోనోకార్పస్ ఒకటి. మాంగ్రూవ్ మొక్కలుగా పిలిచే వీటిని అవగాహన లేక రోడ్ల పక్కన, డివైడర్ల మధ్యలో విరివిగా నాటుతున్నారు. పచ్చదనం, అందం కోసం పెంచే వీటివల్ల నష్టమే ఎక్కువని నిపుణులు చెపుతున్నారు. ఇటీవల కలెక్టరేట్‌లో జరిగిన ఓ సమావేశంలో ఈ కోనోకార్పస్ చెట్ల గురించి కలెక్టర్ ప్రస్తావించారు. కాకినాడ పట్టణ పరిధిలో 4602 చెట్లను గుర్తించామని, వీటిని తొలగించాలని ఆదేశించారు. మొదటి విడతగా పార్కుల్లో నాటిన మొక్కలు తొలగించాలన్నారు. ఈ నేపథ్యంలో 'కోనోకార్పస్' చెట్ల గురించి ప్రత్యేక కథనం..

కార్పొరేషన్(కాకినాడ), జూలై 7: కోనోకార్పస్ చెట్లు తీరప్రాంతాల్లో అధికంగా ఉంటాయి. వీటి వేర్లు బలంగా బురద నేలల్లో లోతుకు చొచ్చుకొని వెళ్తాయి. దీనివల్ల సముద్ర కెరటాలనుంచి నీటి ప్రవాహాన్ని అడ్డుకుని తీరానికి రక్షణగా నిలుస్తుంటాయి. వేగంగా పెరిగే గుణం ఉండడంతో ఈ మొక్కలను జిల్లాలో చాలాచోట్ల నాటారు. వీటి కారణంగా పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని పర్యావరణ నిపుణులు చెప్తున్నారు. ఈమొక్కలు అటవీ ప్రాంతాల్లో పెరిగితే గడ్డిజాతి, ఇతర కలుపు మొక్కలు పెరగడం కష్టమవుతుందని, తద్వారా వన్యప్రాణాలకు ఆహారం దొరకదని చెప్తున్నారు. వన్యప్రాణుల సంఖ్య తగ్గితే మాంసాహార జంతువులకు కూడా ఆహారం దొరక్క మనుగడ కష్టమవుతుందని అంటున్నారు. కోనో కార్పస్ చెట్లవల్ల ఇతర చెట్లు వేగంగా పెరగకపోవడంతో పక్షులకు గూళ్ల ఏర్పాటు చేసుకోవడం కూడా కష్టతరంగా మారుతోందని చెప్తున్నారు. దీంతో సరైన ఆవాసం లేక పక్షి జాతుల పునరుత్పత్తి జరగదని, అవి అంతరించిపోయే ప్రమాదముందని తెలియ జేస్తున్నారు. మొక్కలు సాధారణంగా ఆక్సిజన్‌ను విడుదల చేస్తాయి. కానీ ఇవి ఆక్సిజన్‌ను తీసుకుని కార్బన్‌డైయాక్సైడ్ విడుదల చేస్తాయని చెప్తున్నారు.

తెలంగాణలో నిషేధం..

ఈ చెట్లను దుబాయ్ చెట్లు అని కూడా అంటారు. అమెరికా ఖండంలోని తీర ప్రాంతాల్లో ఇవి ఎక్కువగా పెరుగుతున్నాయి. ఈ రకం చెట్టు వేగంగా అభివృద్ధి చెందే లక్షణాన్ని కలిగి ఉంది. కోన్‌షేప్‌లో పచ్చగా అందంగా ఉంటుంది. ప్రత్యేకించి అరబ్‌దేశాల్లో ఇళ్లపై దుమ్ము రాకుండా ఈ చెట్లను పెంచుతున్నారు. వేగంగా పెరుగుతున్న ఈ ఆకర్షణీయమైన మొక్కను నర్సరీమెన్, ఇతర ల్యాండ్‌స్కేప్ కళాకారులు భారతదేశానికి ఎగుమతి చేసుకున్నారు. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ వెంచర్లు ఆకర్షణీయంగా కనిపించేందుకు ఈ మొక్కలను ఎంచుకుంటున్నారు. ఆ తర్వాత రోడ్లు అందంగా ఉండాలనే ఉద్దేశంతో డివైడర్లు, ఫుట్‌పాత్‌ల పక్కన ఈ చెట్లను నాటారు. ఈ కోనోకార్పస్ ప్లాంట్ల వల్ల లాభం కంటే నష్టమే ఎక్కువని చెప్తున్నారు. ఇప్పటికే చాలాదేశాలు ఈ మొక్కను నిషేధించాయి. ఆంధ్రప్రదేశ్ పొరుగు రాష్ట్రమైన తెలంగాణ కూడా ఈ మొక్కలు నాటడాన్ని నిషేధించింది.

భూగర్భ జలాలకు ముప్పు


గతంలో కార్పొరేషన్ ఆధ్వర్యంలో హరితహారం పేరిట ఏటా పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈక్రమంలో కాకినాడ నగరపాలకసంస్థ కూడా తక్కువ సమయంలో ఎక్కువ ఎత్తులో పెరిగే కోనోకార్పస్ మొక్కలను నగరంలోని పార్కుల్లో ప్రధాన రహదారులకు ఇరువైపులా సెంట్రింగ్‌లో విరివిగా నాటారు. 80 మీటర్ల లోతు వరకు వీటి వేర్లు వ్యాపించి భూగర్భ జలాలను పీల్చేస్తాయని నిపుణులు వెల్లడిస్తున్నారు. జీవకోటికి ప్రాణహాని తలపెట్టే కోనోకార్పస్ మొక్కలను వేర్ల నుంచి తొలగించి పర్యావరణ హితం కోసం ప్రభుత్వం నిషేధించాలని సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు పలుసార్లు మున్సిపల్ అధికారులకు విన్నవించారు.

మొక్కలు తొలగించాలని కలెక్టర్ ఆదేశాలు

కాకినాడ పట్టణంలో పర్యావరణానికి హాని కలిగించే కోనోకార్పస్ చెట్లను తొలగించి వాటి స్థానంలో ప్రాణవాయువు విడుదల చేసే మొక్కలు నాటేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. కాకినాడ పట్టణ పరిధిలో కోనోకార్పస్ చెట్ల తొలగింపు, వాటి స్థానంలో ఆక్సిజన్ విడుదల చేసే మొక్కలు నాటాలన్నారు. కాకినాడ పట్టణ పరిధిలో 4602 కోనోకార్పస్ చెట్లు గుర్తించినట్లు మున్సిపల్ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. తొలిదశ కింద కాకినాడ పట్టణ పార్కుల్లో ఉన్న కోనోకార్పస్ చెట్లను తొలగించాలన్నారు. జిల్లా అటవీశాఖ అధికారులను సమన్వయం చేసుకుని తొలగించిన చెట్ల స్థానంలో వెంటనే ఆక్సిజన్ విడుదల చేసే మొక్కలు నాటేందుకు ప్రణాళిక ప్రకారం పని చేయాలని ఆయన స్పష్టం చేశారు.

మొక్కలు.. మానవులపై ప్రభావం

మనిషి ఆరోగ్యంపై మొక్కలు ప్రభావం చూపిస్తాయని వృక్షశాస్త్ర నిపుణులు చెప్తున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. కొన్నిరకాల మొక్కలు మనుషుల చర్మం, శ్వాసకోశ వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపిస్తాయని పరిశోధనల్లో రుజువైంది. పార్థీనియం, పొద్దుతిరుగుడు, ఉమ్మెత్త వంటి పుప్పొడి రేణువులు తాకడంవల్ల కొంతమందికి స్కిన్ అలర్జీ వస్తుంది. వాటి వాసన పీల్చినప్పుడు శాసనాళాలు, ఊపిరితిత్తుల్లో కొన్ని రసాయినాలు విడుదలై శ్లేష్మం పెరిగి కఫం, దగ్గు, శ్వాసలో ఇబ్బంది తలెత్తే అవకాశం ఉంటుంది. వైద్యపరిభాషలో దీన్ని 'అలర్జిక్ బ్రాంకైటిస్', బ్రాంకిల్ హైపర్ రియాక్టివిటీ అంటారు. కోనోకార్పస్ చెట్ల పుప్పొడి చాలా ప్రమాదకరమని, వీటివల్ల చర్మ, శ్వాసకోశ వ్యాధులు, రక్తపోటు, గుండెపోటు వంటివి తలెత్తవచ్చువంటున్నారు.



ఆహ్లాదం మాటున అనర్థాలు

ఈ కోనోకార్పస్ వృక్ష శాస్త్రీయనామం కోకోకార్పస్ ఏరక్టస్. ఇది అమెరికాలోని ఫ్లోరిడా తీరప్రాంతానికి చెందినది. అక్కడి మడఅడవుల ప్రాంతాల్లో పెరుగుతుంది. చక్కని ఆకృతి, చూడముచ్చటగా ఉండడంతో అందరికీ ఆకర్షణీయంగా మారింది. తొందరగా ఎదగడం దీని ప్రత్యేకత. మంచినీటి పైపులను పగలగొట్టేస్తున్నాయి. భూగర్భ తీగలను అల్లుకుని సమస్యను తెస్తున్నాయి. వాస్తవానికి ఇవి బీడు భూములు, ఇసుక నేలలు, నదీతీర ప్రాంతాల్లోనే అనుకూలం.

దశలవారీగా మొక్కలు తొలగిస్తాం



వెంకటరావు, కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్

కోనోకార్పస్ మొక్కలు పర్యావరణానికి అంత మంచివి కావని తెలిసిన తర్వాత వాటిని నాటడం నిలిపివేశాం. నగరంలోని కొన్ని కేంద్రాల్లో ఉన్న ఈ చెట్లను తొలగించి త్వరలోనే వాటిస్థానంలో వేరే మొక్కలు వేయడం పరిశీలిస్తున్నాం.

శ్వాసకోశ సమస్యలు తలెత్తుతాయి



డాక్టర్ పృథ్వీచరణ్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్

కోనోకార్పస్ వృక్షాల పుప్పడి అత్యంత ప్రమాదకరమైనది. కరోనా సోకిన వ్యక్తి శ్వాసకోశ సమస్యలతో ఎలా ఇబ్బందులు పడతారో ఈ చెట్ల నుంచి పీల్చే గాలివల్ల అంతటి ప్రమాదానికి గురయ్యే అవకాశముంది.

నేటి నుంచి ఇసుక ఉచితం

- జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), జూలై 7: ఏపీ ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం ద్వారా కాకినాడ జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రి రోడ్డు, ఏడీబీ సెంటర్ పెద్దాపురం ఇసుక నిల్వ కేంద్రంలో 1,13,293 మెట్రిక్ టన్నుల ఇసుకను అందుబాటులోకి తెచ్చామని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒక టన్ను ఇసుకకు రవాణా చార్జీలన్నీ కలిపి రూ.655 నిర్ణయించారన్నారు. ఈ సొమ్ము చెల్లించే వినియోగదారులు కలెక్టర్ అండ్ డిస్ట్రిక్ మెజిస్ట్రేట్, బ్యాంకు అకౌంట్ నెంబరు 43130884548, వివరాలకు 9100688814 నెంబరులో సంప్రదించాలన్నారు.

హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్స్ తప్పనిసరి

- జూలై 15నాటికి వాహనాలకు అమర్చుకోవాలి
- జిల్లా ఉప రవాణా కమిషనర్ మోహన్

కార్పొరేషన్(కాకినాడ), జూలై 7: సెంట్రల్ మోటార్ వెహికల్ రూల్స్ 1989లోని రూల్ 50 మోటార్ వాహనాలపై రిజిస్ట్రేషన్ మార్కు ప్రదర్శించేలా అన్ని మోటారు వాహనాల ముందు, వెనుక భాగాల్లో హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్(హెచ్ఎస్ఆర్పీ) రూపంలో స్పష్టంగా ఉండాలని కాకినాడ జిల్లా ఉపరవాణ కమిషనర్ ఎ.మోహన్ తెలిపారు. అవసరమైనచోట వాహనం విండ్ షీల్డ్‌పై మూడో రిజిస్ట్రేషన్ మార్క్ అయిన క్రోమియం ఆధారిత హోలోగ్రామ్ స్టిక్కర్ కూడా ఉండాలన్నారు. గతంలో 2015, జనవరి ఒకటి నుంచి 2019, మార్చి 31 వరకు ఏపీఎస్ఆర్టీసీ ద్వారా ఆమోదించిన లింక్ ఆటోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ వారికి హెచ్ఎస్ఆర్పీ ప్లేట్ తయారీ, హెచ్ఎస్ఆర్పీని వాహనాలపై అమర్చాలని ప్రభుత్వం తెలియజేసిందని తెలిపారు. రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, జీఎస్ఆర్ 1162(ఈ), తేదీ 2018, డిసెంబర్ 4 నుంచి హెచ్ఎస్ఆర్పీ ప్లేటును వాహన తయారీదారులు.. 2019, ఏప్రిల్ 1న లేదా తర్వాత తయారు చేసిన వాహనాలతోపాటు డీలర్లకు సరఫరా చేయాలని డీలర్లు అటువంటి ప్లేట్లపై రిజిస్ట్రేషన్ మార్కు వేసి వాహనాలపై అమర్చాలని తెలియజేసినట్లు తెలిపారు. హెచ్ఎస్ఆర్పీ రుసుము చెల్లించినా కొంత మంది వాహన యజమానులు ఈహెచ్ఎస్ఆర్పీని వాహనానికి అమర్చడం లేదని డీలర్లు ఆయన దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. వాహన యజమానులు వారి వాహనం కొన్న డీలర్‌ను సంప్రదించి ఈనెల 15 లోపు వాహనానికి హెచ్ఎస్ఆర్పీను అమర్చుకోవాలని కోరారు. లేకపోతే పోలీసుశాఖ సమన్వయంతో ఈనెల 16 నుంచి హెచ్ఎస్ఆర్పీ లేని వాహనాలు తనిఖీ చేసి మోటారుసైకిళ్లు, లైట్ మోటారు వాహనాలకు రూ.300, హెవీ రవాణా వాహనాలకు రూ.600 జరిమానా విధిస్తారని మోహన్ హెచ్చరించారు. ఆర్సీ రద్దు పరచడానికి సెక్షన్ 51 ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

- మరిడమ్మ జాతరకు భక్తులు
- వేడుకగా సత్యదేవుని రథోత్సవం
- తలుపులమ్మ లోవలో ఆషాఢ వైభవం
- పురుహూతికా అమ్మవారికి కంఠాహారం

గజ్వేల్ నుంచి మొక్కజొన్న పొత్తుల దిగుమతి

జగ్గంపేట, జూలై 7: మెట్టప్రాంతంలోని జగ్గంపేటలో ఈ సమయానికి మొక్కజొన్న పొత్తు పంట విరివిగా రావడంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాలకు తీసుకొచ్చి అమ్మకాలు జరిపేవారు. ఈ ఏడాది వర్షాలు పూర్తిస్థాయిలో రాకపోవడంతో మొక్కజొన్న వ్యాపారస్తులకు ఇబ్బందులు కలిగాయి. దీంతో తెలంగాణా రాష్ట్రం గజ్వేల్ నుంచి స్వీట్ కార్న్, మామూలు మొక్కజొన్న పొత్తును దిగుమతులు చేసుకుని అమ్మకాలు జరుపుతున్నారు. గజ్వేల్‌నుంచి కాకినాడ జిల్లాని పలు ప్రాంతాల్లో దిగుమతులు చేసుకుని మొక్కజొన్న పొత్తులు వ్యాపారం చేస్తున్నారు. ప్రస్తుతం టన్ను ఒక్కింటికి రూ.27వేలు ఉందని దిగుమతులు చేసుకుని హోల్‌సేల్ రిటైల్ అమ్మకాలు జరుపుకున్నట్లుగా వ్యాపారులు తెలుపుతున్నారు. 100 పొత్తులు రూ.1200 అమ్మకాలు జరుగుతున్నట్లు వ్యాపారులు చెప్తున్నారు. ఈ ఏడాది జిల్లాలో సకాలంలో వర్షాలు పడకపోవడంతో ఇతర రాష్ట్రాలనుంచి మొక్కజొన్న తెచ్చి అమ్మకాలు జరుపుతున్నారు. ప్రస్తుతం జగ్గంపేట పరిసరాల్లో మొక్కజొన్న పంట ఆలస్యంగా వర్షాలు కురవడంతోపాటు విద్యుత్ ఆధారంగా పంటలు వేశారు. దీనిలోభాగంగా జూలైలో కోతకు రావాల్సిన మొక్కజొన్న పంట నెలరోజులపాటు వెనక్కు వెళ్లే పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం కొత్త మొక్కజొన్న పంట వేసి వాటికి కావాల్సిన ఎరువులు, రసాయనిక మందులు కొట్టి పంటను తొందరగా తీసుకొచ్చే పనులను మెట్ట ప్రాంత వాణిజ్య రైతులు ముందున్నారు. ఈ ఏడాది కలిసి రాకపోవడంతో మొక్కజొన్న ధర అధికంగా ఉన్న సమయంలో తమకు పంట కాలం కలిసి రాలేదని మొక్కజొన్న రైతుల నోట వినబడుతోంది.

తరిగిపోయిన రామేశ్వరంపేట గుల్లమెట్ట

- వైసీపీ హయాంలో 200 ఎకరాలు మొత్తం ఖాళీ

గండేపల్లి, జూలై 7: గండేపల్లి మండలం రామేశ్వరంపేట గుల్లమెట్ట అంటే రాష్ట్రంలో మంచి పేరుంది. గండేపల్లి, పెద్దాపురం మండలాల్లో సూరంపాలెం పంచాయతీ పరిధిలోని రామేశ్వరంపేట, పెద్దాపురం మండలం ఆనూరు గ్రామ మధ్యలో 800 ఎకరాలు ఉన్న గుల్లమెట్ట ఉంది. గండేపల్లి మండలం సూరంపాలెం పంచాయతీ పరిధిలో రామేశ్వరంపేటలో 220 ఎకరాలకుపైగా ఈ మెట్ట ఉంది. ఈ మెట్టలో ఉన్న గ్రావెల్ నాణ్యత ఎక్కువగా ఉంటుందని సమాచారం. వైసీపీ అధికారంలో ఉండగా అందరి కళ్లు ఈ మెట్ట మీదే పడ్డాయి. అప్పటి కాకినాడ సిటీ వైసీపీ ఎమ్మెల్యే ఇక్కడి గ్రావెల్‌ను తన అధీనంలోకి తీసుకుని ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ములు చేసుకున్నాడన్న ఆరోపణలున్నాయి. దీనిపై ఉన్నతాధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో అధికారులు ఆ ప్రాంతానికి చేరుకున్నప్పటికీ పైనుంచి ఫోన్లు రావడంతో వెనక్కు వెళ్లాల్సి వచ్చింది. 220 ఎకరాల మెట్ట ఇప్పుడు మొత్తం కనుమరుగైంది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఎవరైనా మెట్టపైకి రావాలంటే భయపడే పరిస్థితి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇక్కడ పరిస్థితి అంతా చక్కబడే పరిస్థితులు కనిపిస్తున్నాయి.



గండేపల్లి మండలం రామేశ్వరంపేటలో తరిగిపోయిన గుల్లమెట్ట

బస్సు సౌకర్యం ఎక్కడ?

- ఆదరణ ఉన్నా గ్రామాలకు సర్వీసులు నిలిపివేత
- ఆటోలపై ఆధారపడే ప్రయాణాలు
- వైసీపీ పాలనలో ఆర్టీసీ తీరుతో ప్రజల ఇక్కట్లు
- కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో పరిస్థితి మారుతుందని ఆశలు



గొల్లప్రోలులో ఆర్టీసీ బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

పిఠాపురం, జూలై 7: గ్రామాల్లో ఆర్టీసీ బస్సులు కనిపించడం లేదు. జాతీయ, రాష్ట్ర రహదారుల వెంబడి ఉన్న ప్రాంతాల్లోనే బస్సు సర్వీసులు నడుపుతూ మిగిలిన వాటిని విస్మరిస్తున్నారు. గతంలో ఎంతో ఆదరణ పొంది నిత్యం ప్రయాణికుల రద్దీతో నడిచే సర్వీసులను రద్దు చేసి ఆర్టీసీ ప్రయాణికులను ఇక్కట్లు పాలుచేసింది. వైసీపీ పాలనలో గ్రామాలకు నడిచే బస్సులు నిలిపివేయగా నిత్యం రద్దీగా నడిచే బస్సు సర్వీసులను రద్దు చేసింది. జిల్లాలో 80శాతంపైగా గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. కూటమి ప్రభుత్వం అధి కారంలోకి రావడంతో ఆర్టీసీ తీరు మారుతుందని ప్రజలు ఆశిస్తున్నారు.

ఒకప్పుడు జిల్లాలో 80-90శాతం గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉండేది. అన్ని గ్రామాలను కలుపుతూ ఏదొక సర్వీసును నడిపేవారు. ఆదాయం తక్కువగా ఉన్నా వాటిని కొనసాగించేవారు. ప్రస్తుతం మాత్రం ఆర్టీసీ బస్సు సర్వీసులు ప్రధాన రహదారులకే పరిమితమయ్యాయి. సైడ్ రూట్‌ల్లో ఉన్న గ్రామాలకు బస్సు సౌకర్యమే లేకుండా పోయింది. ప్రధాన పట్టణాలు, నగరాలు కలుపుతూ గతంలో తిరిగే షటిల్ సర్వీసులు ఎంతో ప్రజాదరణ పొందాయి. నూరుశాతంపైగా ఆక్యుపెన్సీతో నడిచే ఈ సర్వీసులను ఆర్టీసీ ఆకస్మాత్తుగా రద్దు చేసింది. వివిధ వర్గాల ప్రజలకు ప్రయోజనకరంగా ఉన్న పలు సర్వీసులను నిలిపివేయడంతో రెండు, మూడు బస్సులు మారి గమ్యస్థానాలు చేరాల్సిన పరిస్థితి నెలకొంది.

పిఠాపురం నియోజకవర్గంలో పరిస్థితి ఇది

పిఠాపురం నియోజకవర్గంలోని పదిశాతం గ్రామాలకు కూడా బస్సు సౌకర్యం లేదు. గతంలో నూరుశాతం గ్రామాలకు ఆర్టీసీ బస్సులు తిరిగేవి. కొంతకాలంగా తగ్గుతూ వచ్చిన ఇవి గత అయిదేళ్లలో మరింత తగ్గిపోయాయి. ఇప్పుడు నియోజకవర్గంలోని గొల్లప్రోలు మండలం, గొల్లప్రోలు పట్టణంతోపాటు చేబ్రోలు గ్రామానికి మాత్రమే బస్సు సర్వీసులు అందుబాటులో ఉండగా మిగిలిన 9గ్రామాలకు బస్సులు అందుబాటులో లేవు. గొల్లప్రోలు, చేబ్రోలు రెండూ 216వ జాతీయ రహదారిపై కాకినాడ-కత్తిపూడి మార్గంలో ఉండడంతో వివిధ ప్రాంతాల మధ్య తిరిగే బస్సులు ప్రయాణిస్తున్నాయి. ఏకే, ఏపీ మల్లవరం, దుర్గాడ, ఎ.విజయనగరం, తాటిపర్తి, చిన జగ్గంపేట, వన్నెపూడి, చెందుర్తి, కొడవలి గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. గతంలో ఈ గ్రామాలన్నింటికీ ప్రత్యేకంగా బస్సు సర్వీసులు ఉండేవి. పిఠాపురం మండలంలో 24 గ్రామాలు ఉండగా చిత్రాడ, కుమారపురం, ఎఫ్‌కే పాలెం, జల్లూరు గ్రామాలకు మాత్రమే బస్సు సౌకర్యం ఉంది. మిగిలిన 20 గ్రామాలకు బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. ఆ నాలుగు గ్రామాలు కాకినాడ, సామర్లకోట వెళ్లే మార్గాల్లో ఉండడంతోనే సర్వీసులు ఉన్నాయి. కొత్తపల్లి మండలంలో ఏ గ్రామానికి బస్సు సౌకర్యం లేదు. కాకినాడ-తుని మధ్య బీచ్ రోడ్డులో నడిచే ఒక ఆర్టీసీ సర్వీసు మాత్రం తీర ప్రాంత గ్రామాలను కలుపుతూ వెళ్తోంది.

నిత్యం రద్దీతో ఉండి ఆదరణ పొందినా..

కాకినాడ-కత్తిపూడి, తుని-పిఠాపురం-రాజమహేంద్రవరం, ఉప్పాడ-రాజమహేంద్రవరం, తుని-తామరాడ, పిఠాపురం-ఏలేశ్వరం మధ్య తిరిగే సర్వీసులతోపాటు పిఠాపురం-కాకినాడ, ఉప్పాడ-బీచ్‌రోడ్డు-కాకినాడ మధ్య తిరిగే సిటీ బస్సులు ప్రజలనుంచి ఆదరణ పొందాయి. రాజమహేంద్రవరం తిరిగే బస్సులు నిత్యం ప్రయాణికులతో కిటకిటలాడుతూ ఉండేవి. వీటిని ఏ కారణం చూపకుండా అకస్మాత్తుగా రద్దు చేశారు. అప్పటినుంచి రాజమహేంద్రం వరకూ వెళ్లే ప్రయాణికుల ఇక్కట్లు వర్ణనాతీతం. గొల్లప్రోలు నుంచి మూడు బస్సులు మారితే గాని వెళ్లలేని పరిస్థితి. జిల్లాలోనే అత్యధిక ఆదరణ పొందిన సర్వీసుల్లో ఒకటిగా ఉన్న కాకినాడ-కత్తిపూడి షటిల్ కమ్ సిటీ సర్వీసులు ప్రయాణికులతో రద్దీగా ఉండేవి. ఎనిమిది బస్సులు పది నుంచి 20నిమషాల వ్యవధిలో తెల్లవారుజామునుంచి రాత్రి 10.30గంటల వరకూ తిరిగేవి. కాకినాడ బాలాజీచెరువు సెంటర్, ప్రభుత్వాస్పత్రి వరకూ వెళ్లే అవకాశం ఉండడం, ఏ సమయంలోనైనా అందుబాటులో ఉండడంతో ప్రజలకు అనుకూలంగా ఉండేవి. కానీ ఈ సర్వీసులను ఆర్టీసీ ఉపసంహరించుకుంది. వీటిని పునరుద్ధరించాలని కోరినా ఆర్టీసీ అధికారులు నుంచి స్పందన కరువయింది. పిఠాపురం-కాకినాడ సిటీ సర్వీసులను ఇదే రీతిలో రద్దు చేశారు. ప్రధానమైన ఈ మార్గంలో నడిచే బస్సులన్నీ రద్దు కావడంతో ప్రయాణికుల ఇబ్బందులు అధికమయ్యాయి.

ఆటోలపైనే ఆధారపడి..

కాకినాడ-కత్తిపూడి మార్గంలో 90శాతానికిపైగా ప్రయాణికులు ఆటోలపై ఆధారపడే ప్రయాణాలు సాగిస్తున్నారు. ఈ మార్గంలో బస్సు సర్వీసుల సంఖ్యను తగ్గించివేయడంతో బస్సు కోసం అరగంటకుపైగా వేచి చూడాల్సి వస్తోంది. కొన్ని సమయాల్లో గంట వరకూ బస్సు రాకపోవడం, ఒకేసారి రెండు, మూడు బస్సులు రావడం, సమయపాలన లేకపోవడంతో బస్సులపై ఆధారపడడం తగ్గించివేశారు. పిఠాపురం-ఉప్పాడ-బీచ్‌రోడ్డు-కాకినాడ మార్గంతోపాటు గొల్లప్రోలు, పిఠాపురం, కొత్తపల్లి మండలాల్లో 45గ్రామాల ప్రజలు ఆటోలపైనే ఆధారపడి ప్రయాణాలు సాగించాల్సి వస్తోంది.

ప్రభుత్వంలో విలీనమైనా..

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశారు. దీంతో ప్రజలకు మరింత మెరుగ్గా ఆర్టీసీ సేవలందిస్తుందని అంతా భావించారు. అందుకు విరుద్ధంగా సర్వీసులను తగ్గించుకుంటూ వెళ్లిపోయారు. ప్రధాన రూట్లల్లో డొక్కు బస్సులు నడుపుతుండడంతో అందులో శబ్దాలకు ప్రయాణించలేక ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. సాధారణంగా ఆర్టీసీ ఉన్నతాధికారులు నిత్యం రూట్ సర్వేలు నిర్వహించారు. ఈ రూట్‌లో ప్రయాణికులు అధికంగా ఉంటున్నారో గమనించి ఆ రూట్‌లో బస్సు సర్వీసులను నడపాలి. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు పూర్తిగా కార్యాలయాలకే పరిమితమవ్వడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని భావిస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో ఆర్టీసీని పూర్తిగా సమీక్షించి ప్రజాదరణ పొందిన రూట్లతోపాటు గతంలో గ్రామాలకు ఉన్న ఆర్టీసీ సర్వీసులను తిరిగి ప్రారంభిస్తారని ప్రజలు ఆశిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు మేలుకొని గతంలో ఆదరణ పొందిన కాకినాడ-కత్తిపూడి, పిఠాపురం-కాకినాడ సిటీ సర్వీసులు, తుని-పిఠాపురం-రాజమహేంద్రవరం బస్సులను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

జగన్నాథ రథయాత్ర

రథయాత్రకు హాజరైన భక్తులు





సాంస్కృతిక కార్యక్రమం



రథాన్ని లాగుతున్న మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ పురందేశ్వరి



వీధుల్లో రథయాత్ర జరుగుతున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 7: రాజమహేంద్రవరం గౌతమి ఘాట్‌లోని అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం(ఇస్కాన్) ఆధ్వర్యంలో స్థానిక శ్యామలానగర్ రామాలయం సెంటర్ నుంచి ప్రారంభమైన జగన్నాథ స్వామి రథయాత్రను మధ్యాహ్నం 3 గంటలకు జోనల్ సెక్రటరీ రేవతి రమణ్‌దాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, మంత్రి కందుల దుర్గేష్, సత్యగోపీనాథ్‌దాస్ ఇస్కాన్ సేవలను కొనియాడారు. భక్తులతో పాటు పురందేశ్వరి, దుర్గేష్ జగన్నాథ రథాన్ని లాగారు. రథయాత్ర రామాలయం సెంటర్ నుంచి గోరక్షణపేట, ఆజాద్ చౌక్, జాంపేట చర్చి, వెజిటేబుల్ మార్కెట్, బీఈడీ కాలేజీ, డీలక్స్ సెంటర్ హెడ్ పోస్టాఫీసు, మహాకాళేశ్వర గుడి నుంచి ఇస్కాన్ గుడి వరకు సాగింది. అనంతరం సత్సంగ్ ప్రవచనాలు, మహా మంగళహారతి, సాంస్కృతిక కార్యక్రమాలు, నిర్వహించారు. భక్తులకు అన్నదానం జరిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



సర్పవరం జంక్షన్, జూలై 7: జిల్లాలో అక్రమ పీడీఎస్ బియ్యం నిల్వలు పౌర సరఫరాల శాఖ అధికారులు నిర్వహిస్తున్న దాడుల్లో వెలుగులోకి వస్తున్నాయి. ఆదివారం కార్పొరేషన్ 2వ డివిజన్ బొందగుంటలో ఓ పాడుబడిన ఇంట్లో అక్రమంగా పీడీఎస్ బియ్యం నిల్వలు ఉన్నాయన్న సమాచారం మేరకు అర్బన్ ఎంఎస్‌వో ఆనంద్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన 1.85 టన్నుల బియ్యం సీజ్ చేశారు. కిర్లంపూడి మండలం సింహాద్రిపురానికి చెందిన కందా నాగసత్య నారాయణ అనే వ్యక్తి ఇంటింటికి వెళ్లి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి 2వ డివిజన్ బొందగుంటలో డోర్ నెంబర్ 70-17-42/1 పిల్లి సత్యవతికి చెందిన పాడుబడిన పెంకుల షెడ్డులో అక్రమంగా నిల్వ ఉంచాడు. అధికారులకు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా ఆ గదిలో ఉన్న బస్తాల్లో ఉన్న సుమారు 1.85 టన్నుల పోర్టిఫైడ్ కెర్నల్స్ పీడీఎస్ బియ్యంగా నిర్ధారించారు. నిందితుడు నాగసత్యనారాయణపై కేసు రాసి, స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని ఎండీయూ వాహనం ద్వారా కాకినాడలో గల ఎంఎస్ఎల్ గొడౌన్‌కు తరలించినట్లు ఎంఎస్‌వో ఆనంద్ తెలిపారు. పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసినా, అక్రమ రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్ఐ రాజు, కృష్ణానగర్ వార్డు సెక్రటరీ, సిబ్బంది పాల్గొన్నారు.

గత ప్రభుత్వ పోకడలతో విద్యా వ్యవస్థకు దెబ్బ

అమలాపురం టౌన్, జూలై 7: గత ప్రభుత్వ పోకడలతో ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థుల తల్లిదండ్రులకు నమ్మకం సన్నగిల్లిందని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. సాల్ట్ పథకం పేరుతో తీసుకువచ్చిన సర్క్యులర్ 172, జీవో నెం.117లతో ప్రభుత్వ విద్యా రంగానికి తీరని నష్టం వాటిల్లిందన్నారు. ప్రాథమిక తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం వల్ల ప్రాథమిక విద్య పూర్తిగా కుంటుపడిందన్నారు. ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య తగ్గడానికి గల కారణాలపై ప్రస్తుత ప్రభుత్వం సమీక్ష జరపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించే బాధ్యత ఉపాధ్యాయులే తీసుకోవాలని సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం అమలాపురం ఎంప్లాయీస్ హోంలో పి.వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యారంగ సంస్కరణలు ప్రభుత్వ పాఠశాలలు బలహీనమవ్వడానికి కారణమయ్యాయన్నారు. బైజూస్, టోఫెల్, సీబీఎస్ఈ, ఐబీ అంటూ రకరకాలుగా విద్యార్థులపై గత ప్రభుత్వం ఎన్నో ప్రయోగాలు చేసి ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు నమ్మకం లేకుండా చేశారని ఆరోపించారు. ప్రాథమిక స్థాయిలో మాతృభాషలోనే విద్యాబోధన జరగాలని విద్యా హక్కు చట్టం చెబుతున్నా జగన్ ప్రభుత్వం పెడచెవిన పెట్టిందన్నారు. ఉన్నత పాఠశాలల్లో సమాంతర మీడియం లేకపోవడం విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలను వదిలి వెళ్లిపోవడానికి కారణమవుతోందని విమర్శించారు. పర్యవేక్షణ పేరుతో ప్రభుత్వ అధికారులే ప్రభుత్వ పాఠశాలల్లో చదువు రాదని ప్రచారం చేసి ఈ దుస్థితికి తీసుకువచ్చారని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం 4,600కు పైగా 1, 2 తరగతులు మాత్రమే ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో 3, 4, 5 తరగతులను చేర్చుకునేందుకు అనుమతి మంజూరు చేయాలని కోరారు. 6 నుంచి 10 వరకు ఉన్న పాఠశాలల్లో సమాంతరం మీడియానికి అనుమతి ఇవ్వాలన్నారు. విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు టీమ్‌గా ఏర్పడి తల్లిదండ్రుల వద్దకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగేలా ప్రయత్నం చేయాలన్నారు. కోనసీమ జిల్లా ఆలమూరు మండలంలో ఒక పాఠశాల గతంలో 250 మంది విద్యార్థులతో కళకళలాడగా నేడు అదే పాఠశాలలో ఇద్దరు విద్యార్థులే మిగిలారన్నారు. మరో రెండు పాఠశాలల్లో ఒక్కో విద్యార్థి మాత్రమే ఉన్నారన్నారు. కడప, కర్నూలు, శ్రీకాకుళం, విజయనగరం, గుంటూరు జిల్లాల్లోనూ విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని, పాఠశాలల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని వెంకటేశ్వర్లు కోరారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.జ్యోతిబసు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు త్యాగాలకు సిద్ధం కావాలన్నారు. అవసరమైతే అదనంగా ఒక గంట పాఠశాలల్లోనే ఉండి విద్యాబుద్ధులు నేర్పించి పాఠశాలలపై నమ్మకం కల్పించాలన్నారు. జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.వెంకటేశ్వరరావు, సుబ్బారావు మాట్లాడుతూ యూటీఎఫ్ స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవాలు జరుపుకోబోతున్నామన్నారు. జీవో నెం.117ను తక్షణం రద్దు చేయాలని, 1, 2 తరగతులు మాత్రమే ఉన్న పాఠశాలల్లో 3, 4, 5 తరగతుల విద్యార్థులను చేర్చుకునేందుకు అనుమతి ఇవ్వాలని, ప్రాథమిక పాఠశాలల్లో మాతృభాషలోనే విద్యా బోధన ఉండాలని తీర్మానాలను ఆమోదించారు. సమావేశంలో ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ)తో పాటు జిల్లా ఉపాధ్యక్షుడు పి.సురేంద్రకుమార్, జిల్లా కార్యదర్శులు బి.చంద్రకళ, జీవీ రమణ, వైవీటీ దుర్గాప్రసాద్, మురళీమోహన్, ఎం.ప్రదీప్‌కుమార్, వైవీఎస్ఎం బాలాజీ, పి.శ్రీనివాస్, పి.మురుగేశ్వరరావు, వి.రత్నం, టి.విజయకృష్ణ పాల్గొన్నారు.



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

4 ప్రైవేటు ట్రావెల్ బస్సులు సీజ్

రూ.11 లక్షల జరిమానా



బస్సులను సీజ్ చేసిన అధికారులు

రావులపాలెం, జూలై 7: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. వాహనాలను ఆపి రికార్డులను తనిఖీ చేశారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నుంచి వచ్చే కాంట్రాక్టు క్యారేజ్ బస్సులను ఆపి తనిఖీ చేశారు. ఆల్ ఇండియా పర్మిట్ ట్యాక్స్ కట్టకుండా తిరుగుతున్న నాలుగు బస్సులను సీజ్ చేసి ఆర్టీసీ డిపోకు తరలించారు. వాటికి రూ.11 లక్షలు జరిమానా విధించారు. అంతే కాకుండా హెవీ గూడ్స్ వెహికల్స్, ఓవర్‌లోడ్ ఆటోలు, క్యాబ్‌లు, ద్విచక్ర వాహనాలను తనిఖీ చేసి రూ.లక్ష వరకు అపరాధ రుసుం విధించారు. వాహన చోదకులు వాహనాలకు పూర్తిస్థాయిలో రికార్డులు ఉండేలా చూసుకోవాలన్నారు. ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. తనిఖీల్లో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కేవీ నాగేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

తలుపులమ్మ లోవలో ఆషాఢ వైభవం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

తుని రూరల్, జూలై 7: ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో ఆషాఢ మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలుత అమ్మవారికి శాస్త్రోక్తంగా పంచామృత అభిషేకాలు అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆలయ పండితులు భక్తులకు దర్శనభాగ్యం కల్పించడంతో వేలాది మంది భక్తులు మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆషాఢ మాసం తొలి ఆదివారం మట్టి గాజుల విశేష అలంకరణలో భక్తులను అమ్మవారు అనుగ్రహించారు. అమ్మవారి ప్రీతిప్రధానమైన ఆషాఢ మాస పర్వదినాలు కావడంతో తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాది వాహనాల్లో భక్తులు లోవకు తరలిరావడంతో ఆలయ ప్రాంగణంలో రద్దీ నెలకొంది. ముగ్గురు సీఐలు, నలుగురు ఎస్ఐలు, సుమారు 100కు పైబడి సిబ్బందితో జిల్లా పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. ఆలయ ఈవో విశ్వనాథరాజు, చైర్మన్ ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కుటుంబ సమేతంగా లోవకు తరలివచ్చిన భక్తులు దేవస్థానం ఏర్పాటు చేసిన ప్రత్యేక షెడ్‌లలో, వసతి గదుల్లో వంటవార్పు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. ఆదివారం ఒక్కరోజు అమ్మవారిని 40 వేలకు పైబడి భక్తులు దర్శించుకోగా ఆలయానికి వివిధ విభాగాల ద్వారా రూ.9.61 లక్షల ఆదాయం సమకూరింది. గత ఏడాది కంటే ఈ ఏడాది ఆషాఢ మాస మొదటి ఆదివారం రూ.2 లక్షల ఆదాయం అధికంగా వచ్చినట్లు ఈవో విశ్వనాథరాజు తెలిపారు.



గాజుల అలంకరణలో తలుపులమ్మ అమ్మవారు

లోవ భక్తుల నిలువ దోపిడీ

ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానానికి వేలాదిగా తరలివస్తున్న భక్తులను ఆలయంలో వివిధ షాపుల పాటదారులు నిలువునా దోచుకుంటున్నారు. టోల్‌గేట్, చీరలు, కూల్‌డ్రింక్స్, కొబ్బరికాయలు ఇతర షాపుల్లో డబుల్ రేట్లు వసూలు చేస్తున్నట్లు భక్తులు వాపోతున్నారు. అధిక ధరల విక్రయాలపై ఆలయ అధికారులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

మరిడమ్మ జాతరకు భక్తులు



అమ్మవారి దర్శనానికి వెళ్తున్న భక్తులు

పెద్దాపురం, జూలై 7: భక్తుల కొంగు బంగారం మరిడమ్మ జాతరకు మొదటి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ చేబ్రోలు రామ్మోహనరావు ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని బారికేడ్లు, క్యూలైన్లలో భక్తుల సౌకర్యం కోసం టెంట్లు నిర్మించారు. అలాగే పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు మంచినీరు, చంటి పిల్లలకు పాలు, పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేశారు. పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి పర్యవేక్షణలో సీఐ రవికుమార్, ఎస్ఐ సురేష్ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. సుమారు 15 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక చాపల వీధి సంబరం ఎంతగానో ఆకట్టుకుంది. పలు రకాల దేవతా మూర్తుల వేషధారణలు ఆకట్టుకున్నాయి.



నేటి నుంచి ఏఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు

కాకినాడ సిటీ, జూలై 7: ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు కాకినాడ సూర్యకళా మందిరంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి విద్యా, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించనున్నామని సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.జాన్సన్‌బాబు, కె.శివారెడ్డి వెల్లడించారు. ఈ మేరకు కాకినాడలోని పలు కూడళ్లను ఏఐఎస్ఎఫ్ జెండాలు, తోరణాల అలంకరిస్తున్న పనులను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ ఈ శిక్షణా తరగతులకు 26 జిల్లాల నుంచి రాష్ట్ర నాయకులు, విద్యార్థులు హాజరవుతారన్నారు. విద్యార్థుల సమస్యలపై ఏఐఎస్ఎఫ్ అనేక పోరాటాలు సాగించి విజయాలు సాధించిందన్నారు. శిక్షణా తరగతుల ప్రారంభానికి ముందుగా ఏఐఎస్ఎఫ్ పతాకాన్ని మానవహక్కుల ఉద్యమనేత, ప్రముఖ న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు ఆవిష్కరిస్తారన్నారు. ముఖ్య అతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హాజరవుతారని, మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి ప్రారంభ ఉపన్యాసం చేస్తారని తెలిపారు.

హైకోర్టు జడ్జి పూజలు



స్వామివారిని దర్శించుకుంటున్న జడ్జి

ఆత్రేయపురం, జూలై 7: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామిని ఆదివారం హైకోర్టు జడ్జి టి.మల్లికార్జునరావు దంపతులు దర్శించుకున్నారు. వారికి అర్చక బృందం పూర్ణకుంభ స్వాగతం పలికింది. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. జడ్జి దంపతులకు స్వామివారి చిత్రపటం అందజేశారు.

వేడుకగా సత్యదేవుని రథోత్సవం



రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

అన్నవరం, జూలై 7: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి ఆదివారం రథోత్సవం వేడుకగా జరిగింది. ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మవార్లను టేకు రథంపై ఆశీనులు గావించి భక్తుల గోవిందనామస్మరణలు, పండితుల వేదమంత్రోచ్ఛరణల నడుమ ప్రదక్షిణ చేయించారు. అనంతరం హారతులిచ్చి తిరిగి ప్రధానాలయానికి తీసుకెళ్లారు. అలాగే సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం ఆరోగ్య ప్రదాత అయిన సూర్యభగవానుడికి విశేష పూజలు నిర్వహించి వివిధ ఆసనాలతో ప్రార్థించారు. అనంతరం క్షీరాన్నం నివేదించి భక్తులకు పంపిణీ చేశారు.

నేడు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 7: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం సోమవారం రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ హోటల్‌లో జరగనుంది. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, రాష్ట్ర బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఈ సమావేశానికి హాజరవుతున్నారు. కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రానున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత తొలి రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరగనుండడంతో ఆ పార్టీ రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆహ్వానితులకు గూగుల్ ఫార్మాట్‌లో అప్లికేషన్ ద్వారా సమ్మతి పంపించారు. అలాగే ఎంపీ పురందేశ్వరి ఆహ్వానితులను ఆడియో కాన్ఫరెన్స్‌లో ఆహ్వానించారు. రాష్ట్రంలో బీజేపీ బలోపేతంపై ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు.

అరుదైన డెవిల్ ఫిష్



ఆలమూరు, జూలై 7: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మూలస్థానం అగ్రహారం వద్ద ఆదివారం కాలువలో అరుదైన డెవిల్ ఫిష్ లభ్యమైంది. జాతీయ రహదారి చెంతన ఉన్న కోరంగి కాలువలో మత్స్యకారులు చేపల కోసం వల వేస్తే ఇది చిక్కింది. నల్లచారలతో ఆకర్షణీయంగా ఉండడంతో అక్కడి ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఈ డెవిల్ ఫిష్ కాలువలు, గోదావరిలో పెరిగే సాధారణ చేపలను తినేస్తుందని, మిగిలిన చేప జాతికి ప్రమాదమని మత్స్యకారులు చెప్తున్నారు.

ప్రసాదం ప్యాకెట్ల విక్రయాలు

40 వేల ప్యాకెట్ల అమ్మకం

అన్నవరం, జూలై 7: ఆషాఢ మాసం ప్రారంభం కావడంతో తొలి ఆదివారం తలుపులమ్మ లోవ దర్శనానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో సత్యదేవుడి ప్రసాదం కొనుగోలుకు జాతీయ రహదారిపై భక్తుల తాకిడి అధికంగా ఉండడంతో దేవస్థానం అధికారులు అదనపు ప్రసాదం కౌంటర్లు ఏర్పాటు చేశారు. కొండదిగువ తొలిపావంచా, నమూనాలయం ఇరువైపులా కౌంటర్ల వద్ద సుమారు 40 వేల ప్రసాదం ప్యాకెట్లను విక్రయించినట్లు అధికారులు వెల్లడించారు. రాజమహేంద్రవరం వైపు వెళ్లే నమూనాలయం వద్ద నూతనంగా ఏర్పాటుచేసిన కౌంటర్‌లో 5 వేల ప్యాకెట్లను విక్రయించినట్లు తెలిపారు. ఎటువంటి తోపులాటలు, వివాదాలు లేకుండా దేవస్థానం సెక్యూరిటీ ద్వారా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కొండపైన, దిగువన అన్ని కౌంటర్లు కలిపి 60 వేల ప్రసాదం ప్యాకెట్లను విక్రయించారు.

పుర్హూతికా అమ్మవారికి కంఠాహారం

పిఠాపురం, జూలై 7: కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో వేంచేసి ఉన్న అష్టాదశ శక్తి పీఠాల్లో దశమ శక్తి పీఠం అధిష్టాన దేవతయిన పుర్హూతికా అమ్మవారికి భక్తులు బంగారు కంఠాహారం బహుకరించారు. విశాఖపట్నం మధురవాడకు చెందిన కంది సూర్యచంద్రరావు, సుజాత దంపతులు 55.46 గ్రాముల బంగారంతో కంఠాహారం తయారు చేయించారు. దీనిని ఆదివారం ఆలయ అధికారులకు అందజేశారు. పూజలు అనంతరం అమ్మవారికి అలంకరింప చేశారు. దీని విలువ రూ.4.50 లక్షలు ఉంటుంది. దాతలను ఆలయ ఈవో దుర్గాభవాని, ఇతర అధికారులు ఆలయ మర్యాదలతో సత్కరించి ప్రసాదాలు, అమ్మవారి ఫొటోను అందజేశారు.



కంఠాహారం బహుకరిస్తున్న దృశ్యం

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

రావులపాలెం, జూలై 7: చోరీ కేసులో పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడు మండలం చింతపల్లికి చెందిన ఖండవల్లి సీతారాముడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఎం.ప్రేమ్‌కుమార్ తెలిపారు. గోపాలపురానికి చెందిన కంకటాల వెంకటరమణ కిరాణాషాపులో ఈనెల 3న జరిగిన చోరీ కేసులో నిందితుడు సీతారాముడి నుంచి రూ.1.40లక్షలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు.

కాకినాడ

రేపు కిర్లంపూడి మండల సర్వసభ్య సమావేశం

కిర్లంపూడి, జూలై 7: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీపీ తోట రవి తెలిపారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ హాజరవుతారని, ప్రజాప్రతినిధులు, మండలంలోని అధికారులంతా హాజరుకావాలన్నారు.

నేడు పిఠాపురంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

హాజరుకానున్న కలెక్టర్

ఆర్జీదారుల కోసం హెల్ప్‌డెస్కు ఏర్పాటు

పిఠాపురం, జూలై 7: పట్టణంలోని రథాలపేట వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మల్టీపర్పస్ ఫంక్షన్‌హాలు వద్ద సోమవారం ఉదయం 10గంటలు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ నియోజకవర్గస్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నారు. జిల్లా కలెక్టర్ సగిలి షాన్ మోహన్ సహా జిల్లాస్థాయి దిగువ అధికారులు, డివిజన్, నియోజకవర్గంలోని అధికారులందరూ ఈ వేదికకు హాజరు కానున్నారు. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలతో పాటు పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, అర్హత ఉన్నా పింఛన్ అందకపోవడం సహా అన్ని రకాల ఫిర్యాదులను ఈ వేదిక ద్వారా స్వీకరించి పరిష్కారం చూపనున్నారు. వారం విడిచి వారం ప్రతి సోమవారం పిఠాపురంలో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తామని కలెక్టర్ షాన్‌మోహన్ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పర్యటన సందర్భంగా ప్రకటించారు. దీనికి అనుగుణంగా ఈ వేదిక నిర్వహణకు నిర్ణయం తీసుకున్నారు. ఉదయం 9గంటలకు అధికారులందరూ హాజరుకావాలని ఇప్పటికే ఆదేశాలు అందాయి. పరిష్కార వేదికకు భారీగా ప్రజలు, వివిధ సంఘాల ప్రతినిధులు తరలి వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో వారికి ఏ అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆర్జీలు అందించేందుకు వచ్చేవారి కోసం హెల్ప్‌డెస్కు ఏర్పాటు చేస్తున్నట్టు మున్సిపల్ కమిషనరు కనకారావు తెలిపారు. కాగా ఫంక్షన్‌హాలు వద్ద చేయాల్సిన ఏర్పాట్లపై పిఠాపురం సీఐ శ్రీనివాస్, పట్టణ ఎస్ఐ మురళీమోహన్ పరిశీలన జరిపారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 7: ప్రభుత్వాదేశాల మేరకు సోమవారం ఉదయం 10.30గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు తెలిపారు. శారదాదేవి ఆలయ సమీపంలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజల నుంచి నేరుగా సమస్యలపై వినతులు స్వీకరిస్తామన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి 10.30గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్పొరేషన్ కార్యాలయ నెంబర్ 0884-2357800 నెంబరుకు సమస్యలు తెలియజేయవచ్చని తెలిపారు.

రేపు నాయీబ్రాహ్మణ జనరల్ బాడీ సమావేశం

కాకినాడ సిటీ, జూలై 7: కాకినాడ నగర నాయీ బ్రాహ్మణ సేవా సంఘ జనరల్ బాడీ సమావేశాన్ని స్థానిక సంఘ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం నిర్వహించనున్నట్టు సంఘ కాకినాడ జిల్లా అధ్యక్షుడు కింతాడ సత్యనారాయణ తెలిపారు. కాకినాడ సూర్యనారాయణపురంలోని సంఘ కమ్యూనిటీ హాల్‌లో కమిటీ పెద్దలతో అత్యవసర సమావేశం ఆదివారం ఏర్పాటు చేశారు. జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ సమావేశం నగరంలోని 3 ఏరియాల్లోని సంఘ సభ్యులు ఐక్యతతో పాల్గొని సంఘ అభివృద్ధికి సహకరించాల్సిందిగా కోరారు. సంఘ నగర అధ్యక్షుడు భీమనపల్లి వీరబాబు, ఉపాధ్యక్షుడు గంగ్రెడ్డి గోపి, ప్రధాన కార్యదర్శి స్వయంవరపు శ్రీనివాసరావు, సలహాదారులు ఉప్పుడి గోపికృష్ణ, తగరంపూడి వాసు, పట్నాల చంద్రరావు, పొనకర్లపల్లి అప్పారావు, బండారు అప్పారావు, ఏసుబాబు పాల్గొన్నారు.

'నివాస గృహాలు అన్యాయంగా తొలగించారు'

ప్రత్తిపాడు, జూలై 7: ఏళ్ల తరబడి నివసిస్తున్న తమ నివాస గృహాలను గత ప్రభుత్వంలో అన్యాయంగా తొలగించారని తమను ఆదుకోవాలంటూ ఆదివారం అన్నవరానికి చెందిన మహిళలు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజాకు విజ్ఞప్తి చేశారు. అన్నవరం నుంచి ప్రత్తిపాడు వచ్చిన మహిళలు తమకు జరిగిన అన్యాయం, అవస్థలను ఎమ్మెల్యే వద్ద ఏకరువు పెట్టారు. గత కొన్నేళ్లుగా అన్నవరంలో కుటుంబాలతో పూరిపాకల్లో నివసిస్తున్న తమ గృహాలను వైసీపీ ప్రభుత్వంలో కూల్చివేసి రోడ్డున పడేశారని దీని వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. తమకు న్యాయం చేయాలని నూతనంగా గృహాలు చేపట్టాలని ఎమ్మెల్యేను కోరారు. అలాగే నియోజకవర్గంలోని పలుశాఖల అధికారులు వివిధ గ్రామాల కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రత్తిపాడు విచ్చేసి ఎమ్మెల్యే సత్యప్రభను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

'లయన్స్ క్లబ్ సేవలను విస్తృతం చేయాలి'

తాళ్లరేవు, జూలై 7: గ్రామాల్లో పేదలకు లయన్స్ క్లబ్ సేవలను విస్తృతం చేయాలని లయన్స్ గవర్నర్ రమేష్‌రాజ్ అన్నారు. ఆదివారం తాళ్లరేవు సూర్యభాస్కర ఫంక్షన్‌హాల్లో తాళ్లరేవు, గొల్లపాలెం, తూరంగి, అమలాపురం లయన్స్‌క్లబ్ కార్యవర్గం సభ్యులచే రమేష్‌రాజ్ ప్రమాణ స్వీకారం చేయించారు. తాళ్లరేవు లయన్స్‌క్లబ్ అధ్యక్ష కార్యదర్శులుగా పొన్నాడ పేరయ్యరాజు, నరేంద్రరెడ్డిలతో పదవీ ప్రమాణం చేయించి అభినందించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు నడింపల్లి వినోద్, ఏలూరి సూర్యనారాయణ, నున్న దత్తు, బిల్లకుర్తి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'గ్రామ వనరులతోనే అభివృద్ధి చేయాలి'

జగ్గంపేట, జూలై 7: గ్రామ వనరులతోనే అభివృద్ధిని చేయాలని కిర్లంపూడి మండలం బూరుగుపూడికి చెందిన జనసైనికులు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు లేఖ రాశారు. ఈ ఎన్నికల్లో కూటమి విజయం సాధించడం యువతీ, యువకులకు స్ఫూర్తినిచ్చిందని తెలిపారు. పంచాయతీ రాజ్ బాధ్యతలు చూస్తున్న పవన్ కల్యాణ్ హయాంలో ప్రతి గ్రామం అభివృద్ధిలో నడవాలని ఆకాంక్షించారు. స్థానిక వనరుల నుంచి ఆదాయాన్ని పంచాయతీలు సమకూర్చుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.

టీడీపీ విజయోత్సవ ర్యాలీ

తాళ్లరేవు, జూలై 7: ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, ఎంపీ గంటి హరీష్‌మాధుర్‌లు భారీ మెజార్టీతో గెలుపొందడంతో టీడీపీ శ్రేణులు భారీ విజయోత్సవ ర్యాలీ ఆదివారం నిర్వహించారు. సుంకరపాలెంలో ర్యాలీకి మండలానికి చెందిన టీడీపీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు భారీసంఖ్యలో తరలివచ్చారు. ఎంపీ, ఎమ్మెల్యేకు స్వాగతం పలికి బాలయోగి విగ్రహాలకు నివాళులర్పించారు. ర్యాలీ అమలాపురం వెళ్లింది. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లివివేకానంద, చెల్లి అశోక్‌కుమార్, టేకుమూడి లక్ష్మణరావు, ధూళిపూడి వెంకటరమణ, వాడ్రేవు వీరబాబు, పొన్నమండ రామలక్ష్మి, బొక్కా రుక్మిణి, దాసరి జగదీశ్వరి, గుత్తుల సాయి, ఎంపీపీ రాయుడు సునీత, టేకుమూడి అనంతలక్ష్మి, పెమ్మాడి కృష్ణవేణి, వెంటపల్లి ఉమామహేశ్వరి ఉన్నారు.

పంట కాలువల్లో పూడిక తీత పనులు

సర్పవరం జంక్షన్, జూలై 7: కాకినాడ రూరల్ మండలం తమ్మవరంలో ఆదివారం కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ సహకారంతో పంట కాలువల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్క, తూటికాడ తొలగింపు పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే కుమారుడు సందీప్ మాట్లాడుతూ ఖరీఫ్‌లో వరిసాగుకి పూర్తిస్థాయిలో సాగు నీరందే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారన్నారు. ఎమ్మెల్యే ఆర్థిక సహకారంతో రైతుల కోరిక మేరకు పంట కాలువల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్క, తూటికాడ తొలగింపుకు శ్రీకారం చుట్టామని, ఆయకట్టు శివారు భూములకు సైతం సాగునీరందేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. స్థానిక రైతులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్రగాయాలు

గొల్లప్రోలు రూరల్, జూలై 7: గొల్లప్రోలు మండలం దుర్గాడ సెంటర్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్రగాయాలయ్యాయి. పెద్దాపురం మండలం గోరింటకి చెందిన బల్లిపాటి వెంకటరమణ తన భార్య లక్ష్మీతో కలిసి గొల్లప్రోలు మండలం చేబ్రోలు శివారు సత్తెమ్మతల్లి గుడి ఫంక్షన్‌హాలు వద్ద బంధువుల ఫంక్షన్‌లో పాల్గొనేందుకు బయలుదేరారు. సత్తెమ్మతల్లి గుడి వద్ద రోడ్‌క్రాస్ చేసేందుకు ఆగగా పిఠాపురం నుంచి కత్తిపూడి వెళ్తున్న గేదెల లోడు వ్యాన్ వేగంగా ఢీకొంది. ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. పిఠాపురంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. గొల్లప్రోలు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏలేశ్వరంలో ఆర్ఎస్ఎస్ సమావేశం

ఏలేశ్వరం, జూలై 7: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సమావేశం ఆదివారం పట్టణంలో నిర్వహించారు. సత్యనారాయణస్వామి ఆలయంలో స్వయం సేవక్ సంఘ్ సభ్యులు శ్రీరామ్ బాల్యం నుంచి సంఘ కర్తలుగా వచ్చి అనేక విషయాలను అలవర్చుకోవాలన్నారు. నాడీ పతి స్పెషలిస్ట్ పి.కృష్ణంరాజు, ఎనుగు సుబ్రమణ్య శ్రీనివాస్, కోరుమిల్లి నాగేశ్వరరావు, రాతికింద కృష్ణారావు, మజ్జి జగదీష్, తోట వీరరాఘవులు, సీతారామస్వామి, ఈగల సూర్యనారాయణ, గొల్లపూడి గణేష్ పాల్గొన్నారు.

లైన్‌మెన్‌ను నియమించాలని ఆందోళన

తొండంగి, జూలై 7: తొండంగి గ్రామానికి లైన్‌మెన్‌ను నియమించాలని డిమాండ్ చేస్తూ పలువురు గ్రామస్థులు ఆదివారం గోపాలపట్నం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. గ్రామానికి 3 నెలలుగా లైన్‌మెన్ లేకపోవడంతో విద్యుత్ అవాంతరం ఏర్పడినపుడు జరిచేసే నాథుడు కరువయ్యాడని వెంటనే నియమించాలని డిమాండ్ చేసి నిరసన తెలిపారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని ఏఈ ప్రసాద్ తెలిపారు. దుర్గాప్రసాద్, సత్యన్నారాయణ ఉన్నారు.

సానా సతీష్‌ను సత్కరించిన ఆప్తా ప్రతినిధులు

కాకినాడ సిటీ, జూలై 7: సానా సతీష్‌బాబు ఫౌండేషన్ ఛైర్మన్ సానా సతీష్‌ను వారి కార్యాలయంలో అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ (ఆప్తా) ప్రతినిధులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. వచ్చే నెల ఆగస్టు 30న అమెరికాలోని వాషింగ్టన్ డీసీ వేదికగా నిర్వహించబోయే ఆప్తా వార్షికోత్సవ సభకు ముఖ్యఅతిథిగా హాజరుకావాలని ఆయన్ను ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆప్తా సంస్థ ఫౌండర్ శ్రీనివాస్ చందు, సత్యభార్గవ సుంకర పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే!

» అధ్వానంగా ప్రత్తిపాడు ఆర్టీసీ కాంప్లెక్స్ » ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు



బస్ కాంప్లెక్స్‌లో గోతులు, కాంప్లెక్స్ ఇన్‌గేట్ వద్ద గోతుల్లో దిగి వెళుతున్న ఆర్టీసీ బస్సు

ప్రత్తిపాడు, జూలై 7: ప్రత్తిపాడులోని ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ అధ్వాన్నంగా మారింది. చినుకుపడితే కాంప్లెక్స్ పరిసరాలు చిత్తడిచిత్తడిగా మారి ప్రయాణికులకు అసౌకర్యం కలిగిస్తున్నాయి. కాంప్లెక్స్‌లోని 4ప్లాట్‌ఫారంల మినహా మిగిలిన కాంప్లెక్స్ పరిసరాలన్నీ పెద్దపెద్ద గోతులతో రహదారి మార్గాలు శిథిలమై ఛిద్రంగా మారాయి. ఈ బస్టాండ్ ఇన్‌గేట్, ఔట్‌గేట్‌ల వద్ద గోతుల్లో బస్సుల్లో రాకపోకలు జరపడానికి ఆర్టీసీ డ్రైవర్లు నరకయాతన పడుతున్నారు. కాంప్లెక్స్ ఔట్‌గేట్‌మార్గం పెద్ద పెద్ద గోతులతో బురదమయంగా తయారుకావడం వల్ల ఆర్టీసీ బస్సులను ఔట్‌గేట్ మార్గంలో గత 3నెలలుగా నిలిపివేశారు. దీంతో కాంప్లెక్స్‌కు వచ్చే బస్ సర్వీసులను ఇన్‌గేట్ నుంచే బస్సుల రాకపోకలు సాగిస్తున్నాయి. కాంప్లెక్స్‌కు చుట్టూ ప్రహరీ లేకపోవడం వల్ల సమీపంలోని పందులు పరిసరాల్లో వీరవిహారం చేస్తూ అపరిశుభ్రం చేస్తున్నాయి. కాంప్లెక్స్‌కు వచ్చే బస్సుల రాకపోకలు తెలిపేందుకు కంట్రోల్ కూడా లేకపోవడంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. ఏలేశ్వరం ఆర్టీసీ డిపో పరిధిలో ఉన్న ఈ కాంప్లెక్స్ భవనం శిథిలమవుతుంది. కాంప్లెక్స్‌లో గోతుల్లో మట్టిని కప్పి తూతూమంత్రంగా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకుంటున్న అవి మళ్లీ గోతులమయంగా మారుతున్నాయి. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు కాంప్లెక్స్ పరిసరాల్లో పక్కా సిమ్మెంటు రహదారులు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

పురాతన క్షేత్రంలో మైనింగ్ చట్ట విరుద్ధం

హైకోర్టు న్యాయవాది శ్రీమన్నారాయణ



కొడవలిలోని బుద్ధుని ధాతుగర్భ మహాస్థూపాన్ని దర్శించుకున్న శ్రీమన్నారాయణ, సమితి సభ్యులు

గొల్లప్రోలు రూరల్, జూలై 7: కేంద్ర పురావస్తుశాఖచే రక్షిత కట్టడంగా ప్రకటించిన ఏ పురాతన క్షేత్రంలోనూ తవ్వకాలు జరపరాదని, మైనింగ్ జరపడం చట్ట విరుద్ధమని హైకోర్టు న్యాయవాది నంబూరి శ్రీమన్నారాయణ తెలిపారు. గొల్లప్రోలు మండలం కొడవలిలోని బుద్ధుని ధాతుగర్భ మహాస్థూపాన్ని మహాబౌద్ధ స్థూప పరిరక్షణ సమితి సభ్యులు, బౌద్ధ, ప్రజాసంఘాల ప్రతినిధులు, జూనియర్ అడ్వకేట్ మహర్షితో కలిసి ఆయన ఆదివారం దర్శించుకున్నారు. దాతుగర్భ స్థూపం చుట్టూ ప్రదిక్షణ గావించి బుద్ధవందనం త్రిశరణ, పంచశీల పఠించి బుద్ధుని చిత్రపటం వద్ద పుష్పాలు సమర్పించారు. శ్రీమన్నారాయణ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా గతంలో కొడవలి బౌద్ధక్షేత్రంలో గతంలో తవ్వకాలు జరిగాయని, దీనిపై హైకోర్టును ఆశ్రయించి తవ్వకాలు నిలిపివేస్తూ స్టే ఉత్తర్వులు తీసుకువచ్చామన్నారు. హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చినప్పటికి ఈ ప్రాంతంలో అక్రమ మైనింగ్ జరుగుతుందేమోనని పరిశీలించేందుకు క్షేత్రస్థాయి పర్యటనకు వచ్చామని తెలిపారు. ప్రధాన బౌద్ధక్షేత్రం ఉన్న దనందిబ్బ కొండతో పాటు తురకల కొండ, నామాల కొండ, మైనింగ్ ప్రాంతాలను తమ బృందం పరిశీలించిందని చెప్పారు. తాము పరిశీలించిన విషయాలను హైకోర్టు ముందు ఉంచుతామని ఆయన తెలిపారు. పర్యటనలో పరిరక్షణ సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెయ్యల పావన్‌ప్రసాద్, కాశి రామారావు, పంతగడ రామప్రసాద్, ఇనకోటి రాంబాబు, పోతుల శ్రీనివాస్, అంబేద్కర్ బుద్ధ విహార్ అధ్యక్షుడు డాక్టర్ కోరుకొండ బాబ్జి, దాసరి వెంకట్రావు, డాక్టర్ ఆర్ఎస్ జవహర్, డాక్టర్ కె.భానుమతి, నల్లా సరోజిని, ప్రసాద్, లక్ష్మీ, సత్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నృత్యోత్సవాలు

పోర్టుసిటీ(కాకినాడ), జూలై 7: నృత్యాంజలి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూట్ కాకినాడ ఆధ్వర్యంలో నిర్వహించిన నర్మదేశ్వర నృత్యోత్సవం-2024 కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. 2రోజులుగా సూర్యకళామందిరంలో జరుగుతున్న నృత్యోత్సవాలు ఆదివారం రాత్రి ముగిశాయి. రాష్ట్ర వ్యాప్తంగా 400మంది విద్యార్థులు 200కి పైగా నృత్య ప్రదర్శలు చేశారని నృత్యాంజలి నిర్వాహకులు హరి లోకేష్‌శర్మ, కృష్ణవేణి చెప్పారు. నృత్య కార్యక్రమాలను సామర్లకోటకు చెందిన కర్రి ఆదినారాయణరెడ్డి, ఎస్ఆర్ స్కూల్ నిర్వాహకురాలు భార్గవి రామకృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థులందరికీ సర్టిఫికెట్లు, మెమెంటోలు బహుకరించారు. అద్వైత ఆశ్రమ నిర్వాహకులు స్వామి కృపానంద మహరాజ్, నృత్య సమాఖ్య అధ్యక్షుడు జీవీఎస్ వరప్రసాద్, పిఠాపురం మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ జోగా వీర వెంకటరమణయాదవ్, ఎస్.బద్రీ, ఇంపీరియల్ షిప్పింగ్ కంపెనీ మేనేజింగ్ పార్టనర్ కె.సుబ్బరాజు విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

కూనలమ్మ పదాలు, బంగారు తండ్రి పుస్తకావిష్కరణ



పోర్టుసిటీ (కాకినాడ), జూలై 7: సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత డాక్టర్ రెంటాల శ్రీ వెంకటేశ్వరరావు రచించిన కూనలమ్మ పదాలు, బంగారు తండ్రి పుస్తకావిష్కరణ కార్యక్రమం వైభవంగా జరిగింది. గాంధీభవన్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి డాక్టర్ జోస్యుల కృష్ణబాబు అధ్యక్షత వహించగా గనారా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వక్తలుగా మంత్రి కృష్ణమోహన్, డాక్టర్ కాళ్లకూరి శైలజ మాట్లాడారు. సాహితీ స్రవంతి నగర అధ్యక్షుడు మార్ని జానకిరామ్‌చౌదరి అధ్యక్షతన పుస్తకావిష్కరణ జరిగింది. కవి సమ్మేళనంలో అవధానుల మణిబాబు, మాకినీడి, శిరీష, సోమయాజులు, గౌరీనాయుడు, జ్యోతి, పలువురు కవులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 7: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో రాత్రివేళల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను కమిషనర్ జె.వెంకటరావు శనివారం అర్ధరాత్రి పరిశీలించారు. విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులతో మాట్లాడి విధి నిర్వహణలో వారి సమస్యలు తెలుసుకున్నారు. సర్పవరం నుంచి భానుగుడి సినిమారోడ్, టూటౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి 3లైట్ జంక్షన్ వరకు పారిశుధ్య పనులు పర్యవేక్షించారు. నైట్ శానిటేషన్ వర్కర్స్ సమస్యలను కూడా త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. ఆయన వెంట హెల్త్ ఆఫీసర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, మేస్త్రి దుర్గారావు ఉన్నారు.



అర్ధరాత్రి పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్

ఎస్సీ వర్గీకరణ సాధించేవరకూ పోరాటం

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవం



పిఠాపురంలో మాట్లాడుతున్న నాయకులు

పిఠాపురం, జూలై 7: ఎస్సీ వర్గీకరణ సాధించే వరకూ పోరాటం సాగిస్తామని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు తెలిపారు. ఎమ్మార్పీఎస్‌ను స్థాపించి 3 దశాబ్దాలు అయిన సందర్భంగా వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆదివారం పిఠాపురంలో నిర్వహించారు. ఉప్పాడ బస్టాండు, ఇందిరానగర్ 9,7వ వార్డులో వద్ద ఎమ్మార్పీఎస్ జెండాలను ఆవిష్కరించారు. మందకృష్ణ మాదిగకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు తాతపూడి సత్యనారాయణ, గాడిచర్ల బాల, పెదపాటి బాలకృష్ణ, తాతపూడి చిట్టిబాబు, కాకాడ చిట్టిబాబు, ఆరుగుళ్ల జార్జి, కొల్లి రాజు, ముప్పిడి పుల్లారావు తదితరులున్నారు.

జగ్గంపేట: ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కాకాడ నూకరాజు, జిల్లా కార్యదర్శి ఆరుగొల్లు పండు ఆధ్వర్యంలో జగ్గంపేట, కిర్లంపూడి మండలాల్లో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంఈఎస్ ఉమ్మడి జిల్లాల కన్వీనర్ తాతపూడి వెంకటేష్, ఎంఎల్ఎఫ్ నాయకులు పిల్లి బలరాముడు, ఎంఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి దూల్లపల్లి వెంకటరమణ హాజరయ్యారు. జెండా ఆవిష్కరణ, కేక్ కటింగ్ నిర్వహించారు. మాదిగ యువతతో కవాతు చేశారు. ఆరుగొల్లు ఆనంద్, ఆరుగొల్లు శ్రీను, మొర్త చిట్టిబాబు, ఆరుగొల్లు చిట్టిబాబు ఉన్నారు.

తుని రూరల్: తునిలో వివిధ ప్రధాన కూడళ్లలో అంబేడ్కర్ విగ్రహాలకు ఎమ్మార్పీఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మందకృష్ణ మాదిగ పుట్టినరోజును పురస్కరించుకుని కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో ఉమ్మడి గోదావరి జిల్లాల అధ్యక్షుడు ముప్పిడి శ్యామ్‌కుమార్, కార్యదర్శి ఆరుగుల సత్తిబాబు, కన్వీనర్ జిత్తుక మురళి పాల్గొన్నారు.

తూడు తొలగించి సాగునీరు సరఫరా చేయాలి



కొమరగిరిలో పంట కాలువను పరిశీలిస్తున్న వర్మ

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వర్మ

కొత్తపల్లి, జూలై 7: పంట కాలువల్లో తూడు తొలగించి ఆకుమడులను పెంచుకోవడానికి సాగునీరు సరఫరా చేయాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ఇరిగేషన్ అధికారులను కోరారు. పిఠాపురం బ్రాంచి కెనాల్(పీబీసీ)కింద ఉన్న కొత్తపల్లి మండలం కొమరగిరి, కుతుకుడుమల్లి తదితర గ్రామాల్లో సార్వా వరిసాగు ఆకుమడులకు నీరులేక రైతాంగం ఎదుర్కొంటున్న ఇబ్బందులను వర్మ దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆయా గ్రామాల్లో ఆదివారం పర్యటించారు. పీబీసీ ద్వారా సాగునీరు బిక్కవోలు వరకు బాగానేవస్తుందని, అక్కడ వంతెన వద్ద తూడుకాడ పేరుకుపోవడంతో నీరు ముందుకు ప్రవహించడంలేదని వర్మ అధికారులకు తెలిపారు. వంతెన కింద నీరు పారడానికి అడ్డంగా ఉన్న తూడుకాడను వెంటనే తొలగించి సాగునీరు అందించాలని కోరారు. రాబోయే రెండు,మూడు రోజుల్లో పీబీసీకి పూర్తిస్థాయిలో సాగునీరందించడానికి ప్రభుత్వం పనిచేస్తుందని వర్మ రైతులకు హామీఇచ్చారు. కార్యక్రమంలో అనిశెట్టి సత్యానందరెడ్డి, మాజీ జడ్పీటీసీ బత్తుల చైతన్య రాజేష్‌కుమార్, మాజీ ఎంపీటీసీ కుక్కల రామకృష్ణ, గోర్స సర్పంచ్ రొంగళ్ళ వీరబాబు, యండపల్లి గణేష్, రైతు నాయకులు ఉన్నారు.

ఇలా ఉంటే అంటువ్యాధులు రావా?

అపారిశుధ్యంతో ప్రమాదం



వేట్లపాలెం చేనేత కాలనీకి వెళ్లే రోడ్డు పక్కన ఉన్న చెత్తచెదారాలతో దుర్గంధం

సామర్లకోట, జూలై 7: వానాకాలం వచ్చింది. గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్య పరిస్థితులు అధ్వానంగా మారి అంటురోగాలు ప్రబలే ప్రమాద పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికే కొమ్మనాపల్లిలో ప్రారంభమై బెండపూడి, వేట్లపాలెం, గ్రామాలతో బాటూ సామర్లకోటకి డయేరియా వ్యాప్తి చెందిగా పలువురు ఆసుపత్రుల పాలయ్యారు. అయితే చెత్తకుప్పలు తొలగించకపోవడం, ఇంటింటా చెత్త సేకరణ చేపట్టకపోవడం వంటి చర్యలతో గ్రామాలంతటా దుర్గంధం వ్యాప్తి చెందుతున్నాయి. అడపా తడపా వర్షాలు కురుస్తుండడంతో చెత్త కుప్పలు కుళ్లి కుళించి ఈగలు, దోమలతో మరింత అపారిశుధ్యంగా తయారైంది. వేట్లపాలెం, జీ.మేడపాడు, పెదబ్రహ్మదేవం, వెంకటకృష్ణరాయపురం తదితర గ్రామాల్లో పారిశుధ్య పరిస్థితులు పూర్తిగా క్షీణించాయని సత్వరం చర్యలు తీసుకోకుంటే అధికారులపై చర్యలు తప్పవని మండల వైద్యాధికారులు పంచాయతీ రాజ్ ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పించినా నేటికీ చర్యలు శూన్యం. దీంతో గ్రామాల్లో ఇలాంటి పరిస్థితులు ఉంటే అంటు వ్యాధులు రావా అంటూ ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

రోడ్డు మధ్య ఉన్న శిలాఫలకం మార్పు

కాకినాడ సిటీ, జూలై 7: కాకినాడ కార్పొరేషన్ పరిధిలోని 49వ డివిజన్ రాజేశ్వరినగర్‌లో శిలాఫలకాన్ని కలిపి సిమెంట్ రోడ్డు నిర్మించిన వైనం సోషల్ మీడియాలో హల్‌చల్ చేయడంతో ఆదివారం ఉదయం హడావుడిగా తొలగించి వేరు చోటికి మార్చారు. గతంలో 2012లో 13వ ఆర్థిక సంఘ నిధులు రూ.40లక్షలతో రాజేశ్వరినగర్‌లో అవుట్‌లెట్ కలిపేందుకు శరణ్య పబ్లిక్ స్కూల్ నుంచి సోమాలమ్మ గుడి వరకు స్టారమ్ వాటర్ డ్రైన్ నిర్మాణం కోసం ఈ శిలాఫలకం వేశారు. తదనంతరం రోడ్డును విస్తరిస్తూ ఇటీవల రాజేశ్వరినగర్‌లో సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. మార్గం మధ్యలో ఉన్న శిలాఫలకాన్ని కలిపేసి రోడ్డు నిర్మించారు. విషయం తెలియడంతో అధికారులు స్వయంగా పరిశీలించి రోడ్డు మధ్య నుంచి ఉన్న శిలాఫలకాన్ని వేరే చోటికి మార్పించారు.త

చాక్లెట్ల దినోత్సవం

సర్పవరం జంక్షన్, జూలై 7: ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ చాక్లెట్ల దినోత్సవం పురస్కరించుకుని డాక్టర్ అద్దాల సత్యనారాయణ విద్యార్థులకు చాక్లెట్లు పంపిణీ చేశారు. అడబాల రత్నప్రసాదరావు, డాక్టర్ వెంకటరమణ, కుమార్ యాదవ్, సత్యనారాయణ, చంద్రరావు తదితరులు ఉన్నారు.

రోడ్డుకు మోక్షం కలిగించండి!

సర్పవరం జంక్షన్, జూలై 7: కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట ఏపీఎస్పీ ఈశ్వర్‌నగర్ నుంచి దండుపుంతకు పోవ పుంత రోడ్డు మార్గం ఉంది. సర్వే నెంబర్ 60లో సుమారు 2000 వేలు గజాలు స్థలం పుంత రోడ్డుకు అనుకుని ఉంది. ఈ ఏరియాలో తాత్కాలికంగా సామాజిక వికాస భవనంలో రమణయ్యపేట సచివాలయం-5 ఏర్పాటు చేశారు. నూతన సచివాలయం వినియోగంలోకి వస్తే అక్కు వెళ్లేందుకు సరైన రహదారి మార్గం లేదు. దక్షిణ దిక్కులో దండుపుంతకు పోవు మార్గం దశాబ్దాలుగా రెవెన్యూ అడంగుల్ రికార్డుల ప్రకారం పుంతరోడ్డుగా నమోదుగా ఉంది. ఈ రోడ్డుకు అనుకుని ఏపీఐఐసీ పారిశ్రామిక ఏరియా బోర్డర్‌లో సుమారు 2000 వేలు గజాల స్థలం ఉంది. ఇది రెవెన్యూ రికార్డుల్లో పుంతరోడ్డుకు చెందిన స్థలంగా ఉందని స్థానికులు తెలిపారు. ఈ రోడ్డుకు చేర్చి ఉన్న పుంతరోడ్డును గతంలో మూసేసి, దీనికి అనుకుని ఉన్న పుంతరోడ్డుకు చెందిన స్థలాన్ని పారిశ్రామిక ప్రాంతంలో గత ఓ సంస్థ నిర్వాహకులు ఆక్రమించుకున్నారు. ఎవరూ ఈ స్థలంలోకి ప్రవేశించకుండా స్థలం చుట్టూరా ప్రహరీ నిర్మించారు. పిఠాపురం వైపు వెళ్లే రహదారి నుంచి ఏపీఎస్పీ నుంచి ఈశ్వర్‌నగర్ మీదుగా వాకలపూడి, వలసపాకల తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు సరైన రహదారి మార్గం లేక చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే రహదారిలో కాలేజీలు, స్కూల్స్ ఉండడంతో నిత్యం పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, కార్మికులు ట్రాఫిక్‌సమస్యతో ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. పూర్వం ఉన్న పుంత రోడ్డును మూసేయడం, పక్కనే ఖరీదైన సుమారు 2 వేలు గజాల స్థలాన్ని ఆక్రమించుకోవడంతో ఈ సమస్య పరిష్కారం కోసం ఏళ్ల తరబడి అధికారుల చుట్టూ తిరుగుతున్నామని స్థానికులు తెలిపారు. మూసేసిన దండుపుంత రోడ్డు పునరుద్ధరించి, ఆక్రమణ చెరలో ఉన్న స్థలానికి సర్వే చేపట్టి స్వాధీనంచేసుకునేలా కలెక్టర్, ఎమ్మెల్యే పంతం నానాజీ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఆక్రమణ చెరలో దండు పుంతకు చెందిన స్థలం

యనమలను కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు



యనమలకు సమస్యలు వివరిస్తున్న నాయకులు

తుని రూరల్, జూలై 7: మాజీ మంత్రి, శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడిని ఆదివారం తేటగుంటలో ఎమ్మార్పీఎస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వంలో దళితులకు జరిగిన అన్యాయాలను యనమలకు వివరించి తమ న్యాయపరమైన హక్కులు, హామీలను నెరవేర్చాలని కోరారు.

ఎమ్మెల్సీని కలిసిన జనసేన నేతలు



ఎమ్మెల్సీకి అభినందనలు తెలుపుతున్న నేతలు

పిఠాపురం, జూలై 7: శాసనమండలి సభ్యుడిగా ఎన్నికైన పిడుగు హరిప్రసాద్‌ను జనసేన పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి జ్యోతుల శ్రీనివాస్ ఆదివారం కలిశారు. శాసనమండలిలో జనసేన తరపున తొలిసారిగా ప్రాతినిధ్యం వహించనున్న హరిప్రసాద్‌కు అభినందనలు తెలియజేశారు. కలిసినవారిలో శ్రీనివాస్‌తో పాటు జనసేన రాష్ట్ర ప్రోగ్రామ్ కమిటీ సభ్యుడు నల్లం వాసు, ప్రత్తిపాడు నియోజకవర్గ నాయకులు మేకల కృష్ణ, సకినాల లచ్చబాబు ఉన్నారు.

మాధవపట్నంలో అగ్ని ప్రమాదం

సామర్లకోట, జూలై 7: మండలంలోని మాధవపట్నం పంచాయతీ ఆవరణలో గల వీఆర్వో కార్యాలయంలో పాత రెవెన్యూ రికార్డులు ఆదివారం తెల్లవారుజామున జరిగిన అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యాయి. అగ్నిప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. భవనంలో నుంచి మంటలు బయటకు రావడాన్ని ప్రజలు గుర్తించి అధికారులకు సమాచారం అందించారు. కాకినాడ నుంచి అగ్నిమాపక బృందం సంఘటనా స్థలికి చేరుకునే సరికి మొత్తం రికార్డులు దగ్ధమయ్యాయి. ప్రమాద సమాచారంపై నివేదికలను గ్రామ వీఆర్వో వి.వెంకటేశ్వరి తహశీల్దార్ శ్రీనివాస్‌కు అందజేశారు.

ఉచిత వైద్య శిబిరం

సామర్లకోట, జూలై 7: సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ శ్రీధర్ సుమారు 140 మందికి వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. మాన్యువల్ చెకప్, హార్ట్‌బీట్, బీపీ, షుగర్ వంటి పరీక్షలు చేశారు. ఫ్రెండ్స్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గుండు శంకరరావు, విప్పర్తి కొండలరావు, బేవరేజెస్ శ్రీను, సైపుల్లా, జిలాని, ఖాన్ తదితరులు వివిధ సేవలందించారు.

మహిళలకు చీరల పంపిణీ

సర్పవరం జంక్షన్, జూలై 7: రమణయ్యపేటలో మూర్తి పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్, మండల ప్రైవేట్ స్కూల్స్ అధ్యక్షుడు పాలిక నరసింహమూర్తి పుట్టిన రోజు పురస్కరించుకుని ఆదివారం 200 మంది నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అన్నదాన నిర్వహించారు. నరసింహమూర్తిని పలువురు అభినందించారు. గంజా సత్తిబాబు, పాలిక వెంకట్, గుబ్బల విజయ్, పాలిక శ్రీనివాస్, పాలిక అబ్బు, పెంకే వెంకటేశ్వరరావు, మందరపు చిట్టిబాబు పాల్గొన్నారు.

వారాహి అమ్మవారికి విశేష పూజలు

సామర్లకోట జూలై 7: పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో ఉన్న సప్తమాతృకలలో వారాహి అమ్మవారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో వేదపండితులు సోమేశ్వరశర్మ, వెంకన్న, అంజిబాబు, శ్రీనివాసరావు, వినయ్‌లు వేదమంత్రోచ్చారణల మధ్య వారాహి అమ్మవారికి అభిషేక, పుష్పార్చన పూజలు చేశారు. నూతన పట్టు వస్త్రాలతో అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు వారాహి అమ్మవారిని దర్శించుకున్నారు.

తుమ్మలపల్లి రమేష్ పరామర్శ

జగ్గంపేట, జూలై 7: గోకవరం మండలం తిరుమలయపాలెంలో సిరిపి రెడ్డి శ్రీను ఇటీవల గుండెకు ఆపరేషన్ చేయించుకోవడంతో జనసేన పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ పరామర్శించారు. తిరుమలయపాలెం ఎంపీటీసీ చక్రరావు, గోకవరం టౌన్ కన్వీనర్ మండల రైతు కమిటీ అధ్యక్షులు ప్రభ, నేతల నరేంద్ర, ప్రసాద్ ఉన్నారు.

బీజేపీలో చేరిక

రౌతులపూడి, జూలై 7: మండలంలో మూలగపూడి గ్రామానికి చెందిన లవుడు శ్రీనువాసరావు, బలరామపురానికి చెందిన మానివెల్లి వెంకటరమణ, పలువురు బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి సమక్షంలో బీజేపీ చేరారు.

ఐదుగురికి గాయాలు

ఏలేశ్వరం, జూలై 7: ఏలేశ్వరంలో పెద్దవీధికి చెందిన చింతపల్లి నూకరాజు, భార్య ఆశాకు ఆదివారం రాత్రి జరిగిన తగాదాలో ఆశా కుటుంబీకులు నూకరాజు కుటుంబసభ్యులపై దాడి చేశారు. ఈ దాడిలో నూకరాజు కుటుంబీకులు ఐదుగురికి గాయాలయ్యాయి. దీంతో వారిని ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. నూకరాజు ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.